www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 13 జనవరి 2024



మదనపల్లి వైసిపి సమన్వయకర్తగా నిస్సార్ అహ్మద్

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లి నియోజకవర్గం వైసిపి సమన్వయకర్తగా నిస్సార్ అహ్మద్‌ను అధిష్టానం నియమించింది. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మో హన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా విడుదల చేసిన మూడవ విడత సమన్వయకర్తల జాబితాలలో పంచాయతీ రాజ్ శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పని చేస్తూ వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్న నిస్సార్ అహ్మద్‌ను నియమించారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని శుక్రవారం కలిసి కృతజ్ఞతలను తెలియజేసినట్లు ఆయన తెలిపారు. రాబోయే ఎన్నికల్లో తన గెలుపు కోసం, ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డిని చేసేందుకు కోసం ప్రతి ఒక్క వైసిపి కార్యకర్త పనిచేయాలని కోరారు. నియోజకవర్గంలోని ప్రతి ఒక్క కార్యకర్తను కలుపుకొని వైసిపి అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.


పెద్దిరెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న నిస్సార్

సమస్యలు పరిష్కరిస్తేనే విధుల్లోకి..

- కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు
- దీక్షా శిబిరాల వద్ద కోటి సంతకాల సేకరణ
- 32వ రోజూ కొనసాగిన అంగన్వాడీల సమ్మె

ప్రజాశక్తి-రాయచోటి

సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె విరమించమని, సమస్యలు పరిష్కరిస్తేనే విధుల్లో చేరతామని అంగన్వాడీ యూనియన్ నాయకులు పేర్కొన్నారు. అంగన్వాడీ చేస్తున్న సమ్మె శుక్రవారం నాటికి 32వ రోజు చేరుకుంది. ప్రభుత్వం ఎస్మాను ప్రయోగించినా, విధుల నుంచి తొలగిస్తామని షోకాజ్ నోటీసులు జారీ చేసినా తమ ఆందోళనను కొనసాగిస్తూనే ఉన్నారు. కలెక్టరేట్ ఎదుట ఏడవ రోజూ రిలేనిరాహార దీక్షలు కొనసాగాయి. అక్కడే కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని అంగన్వాడీలు నిర్వహించారు. నిరాహార దీక్షలో 18 మంది రాయచోటి ప్రాజెక్ట్ వర్కర్లు హెల్పర్లు మినీ వర్కర్లు పాల్గొన్నారు. సిద్ధమ్మ, నాగమణి,నాగ మనెమ్మ, బంగారు పాప, ఖాజా బీ, కల్పలత, సుమలత, అంజలి దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ 6వ సారి అంగన్వాడీలను ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించినా ఫలితం లేదన్నారు. వేతనం పెంచేదాకా సమ్మె కొనసాగిస్తామన్నారు. సంక్రాంతి పండగను రోడ్లమీదనే శిబిరాలు ఏర్పాటు చేసుకుంటామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలలో సేవలు పొందుతున్న లబ్దిదారులు ఎస్‌సి, ఎస్‌టి, బలహీన వర్గాలు, అసంఘటిత కార్మిక, పేద రైతు, వ్యవసాయ కార్మిక తదితర పేదలకు చెందినవారు ఉంటారని వివరించారు. ఎస్మాను జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రాజేశ్వరి మాట్లాడుతూ అంగన్వాడి వర్కర్లు ఎవరు అధైర్య పడవద్దన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శ్రీలక్ష్మి, నాయకులు రమాదేవి, మధురవాణి, కుమారి, సుమలత, అరుణ, మష్రూమ్ బి, అంగన్వాడీ కార్యకర్తలు, మినీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** సమస్యలు పరిష్కరిస్తేనే విధుల్లో చేరుతామని అంగన్వాడీలు పేర్కొన్నారు. స్థానిక సిడిపిఒ కార్యాలయం వద్ద అంగన్వాడీలు కోటి సంతకాల కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధ్యక్షులు సుకుమారి మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాల క్రితం జగన్మోహన్‌రెడ్డి కేవలం రూ.వెయ్యి మాత్రమే వేతనాలు పెంచారన్నారు. నాలుగున్నర సంవత్సరాలలో నిత్యావసర సరుకులు, కరెంటు బిల్లు, పాలు పెంచుతూ సామాన్యుల జీవన పోషణకు పెను భారంగా మార్చారని తెలిపారు. అంగన్వాడీలు అరకొర వేతనాలతో దుర్భర పరిస్థితులు గడుపుతున్నారని చెప్పారు. అంగన్వాడీలపై ప్రభుత్వం కక్షపూర్తంగా వ్యవహరిస్తుందన్నారు. అంగన్వాడీ కార్మికులకు ఎస్మా చట్టం వర్తించదని ప్రభుత్వానికి తెలిసి బెదిరింపు దోరణలకు పాల్పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయవాది చెన్నకృష్ణయ్య అంగన్వాడీలకు మద్దతు తెలిపి ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ కార్యదర్శి ఓబులమ్మ. సెక్టార్ లీడర్లు, లక్కిరెడ్డిపల్లి, రామాపురం, గాలివీడు మండలాల అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు


రాయచోటి : నిరాహార దీక్షలో అభివాదం చేస్తున్న అంగన్వాడీలు


లక్కిరెడ్డిపల్లె : కోటి సంతకాల సేకరణలో అంగన్వాడీలు

అంతా ఆర్భాటమే!


ప్రయివేట్ లేఅవుట్ కాలనీలో డ్రెయినేజీ పనులు

- భూగర్భ డ్రెయినేజీ పనులు అస్తవ్యస్తం
- నత్తనడకన సాగుతున్న పనులు
- బయటపడుతున్న నాణ్యతా లోపాలు
- జనావాసం లేని ప్రాంతాల్లో పైపులైన్లు
- రూ.236 కోట్ల పనుల్లో వీడని నిర్లక్ష్యం
- ఇబ్బందుల్లో పట్టణ ప్రజలు, వాహనదారులు

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లా కేంద్రమైన రాయచోటిలో సాగుతున్న భూగర్భ డ్రెయినేజీ పనులు మూడు అడుగులు ముందుకు నాలుగు అడుగులు వెనక్కు అన్న చందంగా మారాయి. రూ.236 కోట్లతో పనులు మంజూరు కాగా 2019 డిసెంబర్ 24న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శిలాఫలకం వేశారు. అప్పటి నుంచి పనులు నత్తనడక సాగుతున్నాయి. ఈ పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితులు ఏర్పడింది. పట్టణ పరిధిలో 30 వేల నివాసాలున్నాయి. 250 కిలోమీటర్లు పనులు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు 35 కిలోమీటర్లు మాత్రమే పనులు చేశారు. ఇప్పటి వరకు 17 శాతం మాత్రమే పనులు చేపట్టారు. ప్రస్తుతం చేసిన పనుల్లోనూ నిపుణుల పరిశీలనలో నాణ్యతా లోపాలు బయటపడుతున్నాయి. ఇప్పటి వరకు చేసిన పనులు కూడా ఎక్కువ శాతం ప్రయివేట్ వెంచర్లలోనే చేశారు. పనులు ఊరిబయట, నివాసాలు లేని చోటనే ఎక్కువ శాతం చేపట్టారు. ఎటువంటి అడ్డంకులు లేనే చోటే రెండున్నరు సంవత్సరం పట్టంది. గృహాల మధ్య, జనసంచారం ఉన్న పట్టణంలో పనులు చేపట్టాలంటే ఎన్ని సంవత్సరాలు పడుతుందో చూడాలి. కొన్ని ప్రాంతాలలో చేసిన పనుల కూడా రోడ్డును తవ్వేసి, మట్టి వేసి అలాగే వదిలేశారు. ఆ ప్రాంతంలో వర్షాలు కురవడంతో రోడ్లన్నీ గుంతలు, జలమయమవుతున్నాయని వాహనదారులు, ద్విచక్ర వాహనదారులు, స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబధిత అధికారులు స్పందించి ఊరి మధ్యలోనే పనులు చేపట్టి, డ్రెయినేజ్ సమస్య పరిష్కరించాలని చేసిన పనులలో కూడా సిమెంట్ రోడ్లు వేయాలని స్థానికులు కోరుతున్నారు.


నత్తనడకన సాగుతున్న భూగర్భ డ్రెయినేజీ పనులు

పట్టణంలో పనులు చేపట్టాలి

ముస్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న భూగర్భ డ్రెయినేజీ పనులను ఊరిబయట కాకుండా పట్టణంలో పనులు చేపట్టాలి. ఊరిబయట పనులు చేయడం వలన ఎటువంటి లాభం లేదు. రోడ్డును తవ్వేసి పైపులు వేసి అలాగే వదిలేస్తున్నారు. గుంతల్లో దోమలు ఎక్కువగా ఉంటుంన్నాయి. ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పనుల వేగవంతంగా చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలి.



- అబ్బవరం చిన్నబ్బి, స్థానికుడు, రాయచోటి.

పనులు వేగవంతం చేస్తున్నాం

పట్టణంలో చేపడుతున్న భూగర్భ డ్రెయినేజీ పనులు వేగవంతం చేసేదానికి కృషి చేస్తున్నాం. పైపులు పనులు చేపట్టిన తర్వాత వెంటనే రోడ్డు వేయాలంటే నాణ్యతగా ఉండదు. పైపులు డ్రెయినేజీ కోసం తవ్విన మట్టిని వేసి అది గట్టి బడిన తర్వాత రోడ్డు మరమ్మతులు చేస్తాం. గతంలో బిల్లు ఆలస్యం కావడం జరిగింది. ప్రస్తుతం బిల్లు సకాలంలో వస్తున్నాయి. పనులు వేగవంతంగా చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.



- బి.సతీష్ కుమార్, డిఇ, రాయచోటి.

వాడీవేడిగా మున్సిపల్ బడ్జెట్ కౌన్సిల్ సమావేశం

- సమస్యలపై చైర్‌పర్సన్‌ను నిలదీసిన సభ్యులు
- స్వపక్ష కౌన్సిలర్ల వాగ్వాదం

ప్రజాశక్తి-మదనపల్లి

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం చైర్‌పర్సన్ మనూజారెడ్డి అధ్యక్షతన జరిగిన బడ్జెట్ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా సాగింది. ఈ సందర్భంగా అధికార పక్షానికి చెందిన కౌన్సిల్ సభ్యులు పట్టణంలోని సమస్యలపై గళమెత్తారు. సమావేశం ప్రారంభమైన కొద్ది సేపటికే 16వ వార్డు కౌన్సిలర్ రాజేష్ మాట్లాడుతూ తమ వార్డులో నాలుగేళ్లు కావస్తున్నా రూ.500ల అభివృద్ధి పని జరగలేదని, తమ వార్డులో ఎక్కువ భాగం కమర్షియల్ షాపులు ఉండడంతో ఆదాయం మాత్రం మున్సిపాలిటీకి ఎక్కువగా ఉన్న తన వార్డులో ఎలాంటి అభివృద్ధి పని జరగకపోవడం చాలా అన్యాయమని పేర్కొన్నారు. 6వ వార్డు కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ బడ్జెట్ సమావేశంలో బడ్జెట్‌కి సంబంధించిన అంశాలనే మాట్లాడాలని సూచించడంతో 16వ వార్డు కౌన్సిలర్ రాజేష్ తను వార్డులో సమస్యలను చెప్పుకుంటే అడ్డు చెప్పడానికి నువ్వు ఎవరంటూ ఒకరినొకరు కౌన్సిల్ హాల్‌లోనే ఒకరిపై ఒకరు వాదించుకున్నారు. సభ మర్యాదలు పాటించాలని చైర్‌పర్సన్ కోరడంతో సహచర కౌన్సిలర్లు ఇద్దరికి సర్ది చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం సద్దుమణిగింది. అనంతరం కౌన్సిలర్ పాల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ తమ వార్డులో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, ఎండి పోయిన వృక్షాలు ఉన్నాయని వాటిని తొలగించాలని, వీధి దీపాలు పూర్తిస్థాయిలో లేవని వాటిని ఏర్పాటు చేయాలని కోరడంతో చైర్ పర్సన్ పరిష్కరించేందుకు కోసం కృషి చేస్తానని తెలిపారు. కౌన్సిలర్లు ముబీనా, నాగార్జున బాబు మాట్లాడుతూ అన్ని వార్డులకు సమానంగా నిధులు కేటాయించి అభివృద్ధి పనులు నిర్వహించాలని కోరారు. 23వ వార్డు కౌన్సిలర్ గిరిజా సాయి శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తమ వార్డులో ఇప్పటి వరకు ఏలాంటి అభివృద్ధి కార్యక్రమాలు, పనులు జరగలేదని ఇందుకు అధికారులే కారణమని ఇలా అయితే రాబోయే ఎన్నికల్లో తమ మొహాలను ప్రజలకు చూపించడం ఎలా అని ప్రశ్నించారు. ఇందుకు కమిషనర్ ప్రమీల మాట్లాడుతూ అన్ని వార్డులకు సమాన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కౌన్సిలర్ కాజా మాట్లాడుతూ తమ వార్డులోని మటన్ మార్కెట్‌లోని షాప్ రూములు మున్సిపాలిటీకి సంబంధించినవి కావా అని ప్రశ్నించారు. ఇక్కడ చనిపోయిన గొర్రెలు, మేకలను సైతం కోసి విక్రయిస్తున్నారని రూ.లక్షలకు లక్షలు గడిస్తున్న మున్సిపాలిటీకి మాత్రం అద్దెలు చెల్లించరన్నారు. వెంటనే సంబంధిత మటన్ మార్కెట్‌ను పడగొట్టి షాపింగ్ కాంప్లెక్స్ కట్టినట్లయితే నెలకు దాదాపు రూ.15 లక్షల వరకు ఆదాయం చేకూరుతుందని దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కమిషనర్ స్పందిస్తూ సంబంధిత స్థలంను కోర్టు ద్వారా స్టేటస్ కో-ఆర్డర్ తెచ్చారని అందు వలన వారి నుండి అద్దె వసూలు చేయడం లేదని తెలిపారు. ముస్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ రాబోయేది ఎన్నికల కాలం అయినందున ప్రతి ఒక్కరూ సంయమనం పాటించి పార్టీ అభివృద్ధి కోసం గెలుపు కోసం కృషి చేయాలని కౌన్సిలర్లను కోరారు. సమావేశంలో అధికారులు కౌన్సిలర్లు సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మనూజారెడ్డి

పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల్లో వంద శాతం కనీస సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని పోలింగ్ కేంద్రాలలో కనీస సౌకర్యాల ఏర్పాటు, ఎన్నికల నిర్వహణపై నియోజకవర్గ ఇఆర్‌ఒలు, ఆర్డబ్ల్యూఎస్, స్కూల్ అండ్ కాలేజ్ ఎడ్యుకేషన్, పంచాయతీ రాజ్, విద్యుత్తు, ఆర్‌అండ్‌బి శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1607 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు పోలింగ్ కేంద్రాలలో కనీస సౌకర్యాలు ర్యాంపు, తాగునీరు, నీటి వసతితో మరుగుదొడ్డి, ఫర్నిచర్, విద్యుత్ సౌకర్యం, లైటింగ్ పరికరాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఇఆర్‌ఒలు ఇచ్చిన నివేదిక మేరకు ఆయా నియోజకవర్గాలలోని పోలింగ్ కేంద్రాలలో ర్యాంపులు 259, తాగునీరు 87, నీటి వసతితో మరుగుదొడ్లు 118, ఫర్నిచర్ ఏర్పాటు 204, విద్యుత్ సౌకర్యం 64, లైటింగ్ పరికరాలు 83 పిఎస్ లలో ఏర్పాటు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఇఆర్‌ఒలు, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో కృషిచేసి ఈ నెల 25 లోగా నూరు శాతం పోలింగ్ కేంద్రాల్లో కనీసం సౌకర్యాలు ఏర్పాటు పూర్తి చేయాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలను మరొకసారి క్షుణ?ంగా తనిఖీ చేసి ఇంకను కనీస సౌకర్యాలను కల్పించాల్సిన వాటిని గుర్తించాలన్నారు. బిఎల్‌ఒలు, తహశీల్దార్లు, ఇఆర్‌ఒలు, ఆయా అంశాల జిల్లా అధికారులు పోలింగ్ కేంద్రాలను తప్పనిసరిగా సందర్శించి కనీస వసతులు లేని స్కూల్స్, కాలేజీల వివరాలు సమర్పించాలని చెప్పారు. ఈ నెల 25 తర్వాత ఎన్నికల నిర్వహణపై సెక్టరుల అధికారులకు శిక్షణ ఏర్పాటు చేయాలని ఇఆర్‌ఒలకు సూచించారు. ఇందుకు షెడ్యూల్ రూపొందించాలన్నారు. ప్రతి పోలింగ్ కేందన్న ఆ పోలింగ్ కేంద్రం నెంబరు పెయింటింగ్ చేయించాలని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల మార్పు, పేరు మార్పుల వివరాలను వెంటనే సమర్పించాలన్నారు. అన్ని మండలాలు, నియోజకవర్గాలలో ఇవిఎంల వినియోగంపై అవగాహన కార్యక్రమాలు బాగా నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఆర్‌ఒ సత్యనారాయణ, ఆర్డీఒలు రంగస్వామి, మురళి, రామకృష్ణారెడ్డి, పీలేరు, తంబళ్లపల్లె, కోడూరు ఇఆర్‌ఒలు గోపాలకృష్ణ, రాఘవేంద్ర, మల్లికార్జునరెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ ప్రసన్న కుమార్, డిఇఒ శ్రీరాం పురుషోత్తం, పిఆర్ ఎస్ఇ దయాకర్‌రెడ్డి, ఎస్ఎస్ఎ జిల్లా కో-ఆర్డినేటర్ కరుణాకర్, ఇంటర్మీడియట్ ఆర్ఐఒ కృష్ణయ్య, విద్యుత్, ఆర్‌అండ్‌బి డిఇలు చంద్రశేఖరరెడ్డి, సహదేవరెడ్డి, సంబంధింత శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కిషోర్‌కుమార్‌రెడ్డి

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి : 'నల్లారి'

ప్రజాశక్తి-పీలేరు/కలికిరి

రాష్ట్రంలో దురహంకారి పాలనకు స్వస్తి పలికి ప్రజలకు సుపరిపాలన అందించడం కోసమే తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు రా..కదలిరా... కార్యక్రమాన్ని చేపట్టారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ బాధ్యులు నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన పీలేరు నియోజకవర్గంలోని కెవి పల్లి, కలికిరి మండలాల్లో సుడిగాలి పర్యటనలు చేసి టిడిపి శ్రేణులతో సమావేశాలను నిర్వహించి వారికి దిశ, నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 24న పీలేరులో జరగనున్న తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడు తలపెట్టిన రా.. కదలిరా.. భారీ బహిరంగ సభను టిడిపి, జనసేన పార్టీ శ్రేణులు, అనుబంధ సంఘాలు, మహిళా సంఘాలు, నల్లారి అభిమానులు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. పీలేరులో జరిగే చంద్రబాబు బహిరంగ సభచూసి తాడేపల్లి ప్యాలెస్ లో నివాసముంటున్న జగన్మోహన్ రెడ్డి వెన్నులో వణుకు పుట్టాలని అన్నారు. భారీ జనవాహిని మధ్య జరగబోయే బహిరంగ సభతో తెలుగుదేశం పార్టీ విజయానికి ఇదే తొలి మెట్టు కావాలన్నారు. రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పీలేరులో జరిగే భారీ బహిరంగ సభను తనపై భరోసా, బాధ్యత, నమ్మకంతోనే ఏర్పాటు చేసినట్లు చంద్రబాబు అన్నారని తెలియజేశారు. గతంలో మదనపల్లి ప్రాంతంలో మినీ మహానాడు, కలికిరి పట్టణంలో మూడు రోజులపాటు రాజంపేట పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల సమీక్షా సమావేశాలు, లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర మనం సమిష్టిగా విజయవంతం చేయగలిగామని పేర్కొన్నారు. అదే స్ఫూర్తి, ఉత్సాహంతో చేయడం కోసం మనపై మరో బలమైన బాధ్యత ఉంచారని కిషోర్ కుమార్ రెడ్డి టిడిపి శ్రేణులకు తెలియజేశారు. దీన్ని కూడా విజయవంతం చేయడం మన కర్తవ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాలు, నల్లారి అభిమానులు పాల్గొన్నారు.

సమాజంలో యువత పాత్ర కీలకం

- డిఎస్‌పి మహబూబ్ బాషా

ప్రజాశక్తి-రాయచోటి

సమాజంలో యువత పాత్ర కీలకమని డిఎస్‌పి మహబూబ్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలను, స్వామి వివేకానంద జయంతిని సంయుక్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాయచోటి సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ మహబూబ్ బాషా, వి.ఆర్ విద్యా సంస్థల అధినేత వెంకట్రామిరెడ్డి, శ్రీసాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి, నెహ్రూ యువజన కేంద్రం సభ్యులు సురేంద్రారెడ్డి, అధ్యాపకులు శ్రీస్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహబూబ్ బాషా మాట్లాడుతూ వివేకానందుని జీవితం యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. వివేకానందుని ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం మన బాధ్యతని తెలియజేశారు. కళాశాల యాజమాన్యానికి అధ్యాపకులకు విద్యార్థిని విద్యార్థులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ భారతీయ సనాతన సంప్రదాయాలను గౌరవిస్తూ, భావితరాలకు భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే పండుగ పర్వదినాలను కులమతాలకు అతీతంగా జరుపుకొని భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటాలని సూచించారు. ఈ నూతన సంవత్సరంలో విద్యార్థిని విద్యార్థులు ఉన్నతమైన ఆశయాలకు శ్రీకారం చుట్టి ఘన విజయాలను సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. వి ఆర్ విద్యాసంస్థల అధినేత వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ యువత నైతికంగా ద ృఢంగా ఉండి, దేశం కోసం అంకితభావంతో అన్యాయంపై పోరాడి, ప్రశ్నించే ధైర్యం, లక్ష్యసాధన సామర్థ్యాలను పెంపొందించుకొని, జాతీయ భద్రత, దేశ ప్రయోజనాలను రక్షించడంలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. దేశానికి యువత ఎంతో చేయాల్సింది ఉందని తెలిపారు. కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ భారతీయ సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత స్వామి వివేకానందునికి దక్కుతుందని, స్వామి వివేకానందుని జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సంక్రాంతి సంబరాల నిర్వహణలో భాగంగా రంగవల్లి పోటీలు, కోలాటం, ఉట్టి కొట్టడం, భోగి మంటలు వంటి సంప్రదాయక ఆటల పోటీలు, కార్యక్రమాలను నిర్వహించి కళాశాల ఆవరణలో తెలుగుదనాన్ని ప్రతిబింబించే కళారూపాలను నేటి యువతరానికి పరిచయం చేశారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు జ్ఞాపికలను, బహుమతులను బహూకరించారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం సభ్యుడు సురేంద్ర రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్, హెడ్స్, అధ్యాపకబృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

22న ఓటర్ల జాబితా విడుదల : గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

ఈ నెల 22వ తేదీన ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తామన ఓటర్ జాబితా కొరకు వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వెంటనే క్లియర్ చేయాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ జాబితా కొరకు వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఒక్కటి కూడా పెండింగ్ లేకుండా వెంటనే క్లియర్ చేయాలని పేర్కొన్నారు. ఈ నేల 22వ తేదీన ఓటర్ల జాబితా విడుదల చేస్తామన్నారు. ఎక్కడ కూడా బోగస్ అప్లికేషన్స్ ఫైల్ చేయకూడదని బోగస్ అప్లికేషన్లు వచ్చినట్లయితే సంబంధిత వ్యక్తులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఓటర్ జాబితా అంశంలో భాగంగా పిఎస్ఇ, డిఎస్ఇలో వంద శాతం ఫారం 7 జనరేట్ చేయాలన్నారు. డబుల్ ఎంట్రీలు ఉండకుండా చూసే బాధ్యత తహశీల్దార్లు, ఆర్డీవోలపై ఉందన్నారు. క్లస్టర్ వారీగా ఫారం 7, ఫారం 8, సాంకేతిక సమస్యతో పెండింగ్ ఉన్నవాటిపై బిఎల్‌ఒలు ఒకటికి రెండుసార్లు పరిశీలించి వెంటనే క్లియర్ చేయాలని పేర్కొన్నారు. ఈనెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఇవిఎంలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. జిల్లాలో మొత్తం 1607 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని అన్ని పోలింగ్ కేంద్రాలలో కనీస సౌకర్యాలు ర్యాంపు, తాగునీరు, నీటి వసతి, ఫర్నిచర్, విద్యుత్ సౌకర్యం, లైటింగ్ వంటి వసతులు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎక్కడైనా రాజకీయ పార్టీల ప్రతినిధులు సమస్యాత్మక, అతి సమస్యాత్మక, పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు గుర్తించినట్లయితే వెంటనే అలాంటి పోలింగ్ స్టేషన్ల వివరాలు తమకు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఆర్ఒ సత్యనారాయణ, రాయచోటి ఆర్డీవో రంగస్వామి, ఎన్నికల విభాగం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులతో పసుపులేటి పవన్‌కుమార్

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు : పవన్

- హ్యాండ్‌బాల్ జూనియర్ బాలికల టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

క్రీడాకారులు కఠోర సాధనతో ఉన్నత స్థాయికి ఎదగాలని మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్య తనయుడు పవన్ కుమార్ తెలియజేశారు. పసుపులేటి బ్రహ్మయ్య స్మారకార్థం తాళ్లపాక సమీపంలోని శాన్వి ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్‌లో 45వ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ జూనియర్ బాలికల ఛాంపియన్షిప్‌కు ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ గెలుపోటములను ఆశించకుండా పాల్గొనడం, నైపుణ్యతను కనపరచడమే ముఖ్యమని భావించి రాణించాలని పేర్కొన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో మరిన్ని పోటీలను నిర్వహించి ప్రోత్సహించదలిచామని తెలిపారు. అంతకుముందు వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు ముఖ్య అతిథులకు గౌరవ వందనం చేసి అభినందించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ భరత్, ఆంధ్రప్రదేశ్ హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సి.శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.రామాంజనేయులు, జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి లక్ష్మణ్, రవి, చంద్రశేఖర రావు, సత్య ప్రసాద్, సురేష్ కుమార్, నిర్మల, జయరాముడు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గడికోట ద్వారకనాథ్‌రెడ్డి

టిడిపి అధికారంలోకి రావడం ఖాయం

ప్రజాశక్తి-రామాపురం

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎవరికి టికెట్ ఇచ్చినా అందరం కలిసికట్టుగా పనిచేసి టిడిపి అభ్యర్థిని గెలిపించుకుని,చంద్రబాబును ముఖ్య మంత్రిని చేస్తామని మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఆయన స్వగృహంలో శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అవినీతిలో కూరుకపోయిందని అన్నారు. అవినీతి, అరాచకాలు, విధ్వంసం పెరిగిపోయాయని అన్నారు. అవినీతి వాటా సొమ్ము 50శాతం ముఖ్య మంత్రికి చేరుతుందని ఆరోపించారు. టిడిపి ప్రభు త్వం అధికారంలోకి వస్తే బడుగు, బలహీన వర్గాలకు అన్ని విధాలుగా మేలు చేకూరుతుందని అన్నారు. టిడిపి ఇప్పటికే ఆరు పథకాలు ప్రవేశపెట్టిందని అవే కాకుండా జనసేన టిడిపి కలిసి మరికొన్ని పథకాలు ప్రవేశపెడతామని తెలిపారు. ఈ ప్రభుత్వంలో రైతులకు మేలు జరగలేదని, ఉద్యోగులకు జీతాలు సక్రమంగా అందించ లేకపోతున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ఆర్.ఆంజ నరెడ్డి, రేఖ, ఆంజనేయులు, రాజా, వెంకటరామిరెడ్డి, చాన్‌బాషా, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించడానికి ఏర్పాటు చేస్తున్నట్లు పూర్వవిద్యార్థులు పేర్కొన్నారు. పాఠశాలలో పరిశుభ్రపరచి మైదానంలో షామియానాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పూర్వ విద్యార్థుల కలయిక కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నామని చెప్పారు.

టిడిపిలో చేరిన సూర్యప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-కలికిరి

కెవిపల్లి మండలం నూతనకాలువ పంచాయతీకి చెందిన సూర్యప్రతాప్‌రెడ్డి తన అను చరులతో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా కిషోం కుమార్‌రెడ్డి మాట్లాడుతూ టిడిపి నలభై ఏళ్ళ చరిత్ర కలిగిన ఒక పరిశ్రమ లాంటిదని, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. నియోజకవర్గ పరిధిలో మున్ముందు మరిన్ని చేరికలు ఉంటాయని అన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామని అన్నారు. టిడిపి గెలుపుకు క్షేత్రస్థాయిలో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు నిజాముద్దీన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అరాచక పాలనకు చరమగీతం : ఆర్‌జె

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

వైసిపి అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రాజంపేట పార్లమెంట్ టిడిపి అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్ పేర్కొన్నారు. మం డల పరిధిలోని రాచ వేటివారిపల్లి పంచాయతీ దిగువ మాచిరెడ్డిగారి పల్లి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని స్థానిక నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్ని కల్లో టిడిపి, జనసేన పార్టీలు గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. టిడిపి అధికారంలోకి వస్తే మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తారన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 18 ఏళు నిండిన మహిళలకు నెలకు రూ.1500, సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం పేరుతో ఎంతమంది పిల్లలు చదివితే అంద రికీ సంవత్సరానికి సంవత్సరానికి రూ.15వేలు ఇస్తా మని చెప్పారు. రైతులకు సంవత్సరానికి రూ.20వేలు వంతున వ్యవసాయ సాగు కోసం అందించ నున్న ట్లు తెలిపారు. మూడు సిలిండర్లు ఉచితంగా ప్రతి ఇంటికి ఇస్తారని అన్నారు. టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుక వచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కె.శ్రీనివాసులు, కృష్ణమూర్తి, దేవకి, వినోద్, చలపతి పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ప్రశాంతమైన వాతావరణంలో సంక్రాంతి పండుగ వేడుకలను చేసుకుందామని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండు గను మండల ప్రజలు బంధువులతో ఆనందంగా ప్రశాంతమైన వాతావరణంలో చేసుకోవాలని అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందెలు, పేకాట, జూదం, వంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలను నిర్వహించకూడదని హెచ్చరించారు. మద్యం సేవించి రోడ్డుపై వాహనాలు నడపరాదని అన్నారు. పోలీసుల హెచ్చరికలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోడి పందెలు, పేకాట నిర్వహణపై సమాచారం అందించాలని కోరారు. **పుల్లంపేట :** రానున్న సంక్రాంతి పండగ సందర్భంగా మండల పరిధిలో ఎవరైనా కోడిపం దెలు, పేకాట, మట్కా, జూదం నిర్వహించిన వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్ఐ రఘురాం ఒక ప్రకటనలో తెలిపారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి సంక్రాంతి పండుగను కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని తెలిపారు. **పెద్దమండ్యం :** మండ లంలో సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలు, పేకాట పై ప్రతేక నిఘా ఏర్పాటు చేస్తున్న నట్లు ఎస్ఐ రామంజనేయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూసంక్రాంతి పండుగ సందర్భంగా ఊరికి వెళు తున్నాం అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టవద్దని, ఇంటి ఆవరణంలో లేదా ఏదైనా గదిలో లైటు వేసి ఉంచాలని సూంచారు. గ్యాస్ సిలిండర్ ఆఫ్ చేయడం మరచిపోవద్దని..నమ్మకమైన వ్యక్తిని వాచ్ మెన్‌గా పెట్టుకోవాలని సూచిం చారు. సిసి కెమెరాలు అమర్చి వాటికి మొబైల్ అనుసంధానం చేసుకో వాలని బస్సు, రైళ్లో ప్రయాణిస్తున్నప్పుడు బంగారు, నగదును జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. ఊరికి వెళ్లేముందు పోలీస్ స్టేషన్లో తెలపాలన్నారు.

రంగుల ముగ్గుపిండి పంపిణీ

ప్రజాశక్తి-వీరబల్లి

టిడిపి నేత గంటా నరహరి ఆధ్వర్యంలో సంక్రాతి పండుగ సంద ర్భంగా వీరబల్లి మండల వ్యాప్తంగా మహిళలకు శుక్రవారం రంగు రంగుల ముగ్గుల పిండి పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపినాయకలుఉ గుదె నాగా ర్జున నేతృత్వంలో, గుర్రపు గారిపల్లె , మట్లి తాటిగుంటపల్లె గ్రామాలలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి కుటుంబాలకు దాదాపు రెండువేల ఇళ్లకు రంగు ముగ్గు రాళ్లు, ముగ్గు పిండి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రసాద్, కొత్త గంగయ్య అనిల్, మల్లికా ర్జున, శివకుమారు, లోకేష్ పాల్గొన్నారు.

లోఓల్టేజి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండలంలోని ఎన్‌ఒపల్లి పంచాయతీలోని కలిచెర్లపాతురులో గతంలో లోఓల్టేజ్ సమస్య అధికంగా ఉండటంతో గ్రామస్తులు సర్పంచ్ పద్మావతి తిరుపాల్ నాయక్ దృష్టి తీసుకపోయారు. సర్పంచ్ సమస్యను ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, ఎంపిపి పూర్ణచంద్రరమేష్ దృష్టికి తీసుక పోయి సమస్యను పరిష్కరించారు. వారి సహకారంతో పాతురుకు 100కెవి ట్రాన్స్‌ఫార్మన్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపిపి పూర్ణచంద్రిక రమేష్, ,లైన్‌మెన్లు ఈశ్వరయ్య, సాంబశివ నాయుడు, పాల్గొన్నారు.



నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎంపిపి, సర్పంచ్‌లు

ఉత్సాహంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు



మదనపల్లి: సంక్రాంతి సంబరాల్లో ఆర్‌డిఒ, కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-మదనపల్లి

స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలో ముందస్తు సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మదనపల్లి ఆర్‌డిఒ ఎమ్మెస్ మురళి, తహశీల్దార్ మహబూబ్ చాంద్, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మురళి మాట్లాడుతూ తెలుగు వారందరూ ఎంతో ఘనంగా నిర్వహించుకునే పండుగలలో ముఖ్యంగా సంక్రాంతి పండుగ ఒకటని అన్నారు. పండుగకు రంగవల్లులు, గొబ్బెమ్మలు, పశువులకు ప్రత్యేక అలంకరణ చేయడం ముఖ్యంగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఎంతో సంతోషాలను, సౌభాగ్యాలను ఇచ్చే ఈ సంక్రాంతి పండుగను మనం దరం నిర్వహించుకోవడం పరిపాటని అన్నారు. సంక్రాంతి సంబరాలను గ్రామాలలో వేడుకగా ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మహబూబ్ చాంద్, సుధాకర్‌రెడ్డి పట్టణ ప్రముఖులు ప్రజలు పాల్గొన్నారు.

'యల్లటూరు' ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

రాజంపేట అర్బన్ : నియోజకవర్గ జనసేన నాయకులు యల్లటూరు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని జడ్‌పి బాలికోన్నత పాఠశాల క్రీడా మైదానంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు పట్టణవాసులతో పాటు మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలు గ్రామీణ సంప్రదాయం ఉట్టిపడేలా వివిధ ఆకృతులలో రంగు రంగుల రంగవల్లులు ఆకర్షణీయంగా అలంకరించారు. శ్రీనివాసరాజు క్రీడా మైదానానికి చేరుకుని పోటీలను పర్యవేక్షించారు. గెలుపొందిన మహిళలకు ప్రథమ బహుమతిగా రూ.15 వేలు, ద్వితీయ బహు మతి రూ.10 వేలు, తృతీయ బహుమతి రూ.5 వేలతో పాటు పాల్గొన్న ప్రతి మహిళకు ప్రోత్సాహక బహు మతులు అందించారు.కార్యక్రమంలో జనసేన నాయకులు సింగంశెట్టి నరేంద్ర, విఎస్‌కె కుమార్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.**నందలూరు:** నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ, ఆర్ఎస్ రోడ్డులో జనసేనపార్టీ యల్లటూరు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలకు మహిళలు పెద్దసంఖ్యలో హజరయ్యారు. యంబలూరు కళ్యాణి ప్రథమ బహుమతి 15 వేలు, ద్వితీయ బహుమతులను ఝాన్సీలక్ష్మి, పదివేల రూపాయలు, తృతీయ బహుమతి వెంకటసుబ్బమ్మ ఐదువేల రూపాయలను గెలుచుకున్నారు. మ్యూజికల్స్ చైర్స్ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో సి. మాధవి, ఎస్.లలిత సంయుక్త విజేతలుగా నిలిచారు. ఈ పోటీలను తిలకించేందుకు ఆసక్తి చూపారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ శ్రీవాణి, యల్లటూరు మంజుల వ్యవహరించారు. కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసిఎల్లటూరు శివరామరాజు, జనసేన పార్టీ రాయలసీమ రీజనల్ కో-ఆర్డినేటర్ జ్యోతి, సమ్మెట శివప్రసాద్, ఆకుల చలపతి, గురివిగారి వాసు, తిప్పాయపల్లె ప్రశాంత్, రాజేష్, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



రాజంపేట : ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న శ్రీనివాసరాజు

ఘనంగా జాతీయ యువజనోత్సవ వేడుకలు



నందలూరు: విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపల్

ప్రజాశక్తి-నందలూరు

జాతీయ యువజన దినోత్సవ వేడుకలను శుక్రవారం నందలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. స్వామి వివేకానంద చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం నిర్వహించిన పోటీల నందు విజేతలైన వారికి బహుమతులు అందజేయడం జరిగిందని స్టెప్, ముఖ్య కార్యనిర్వహ ణాధికారి సి. సాయి గ్రేస్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సురేష్ మాట్లాడుతూ స్వామి వివేకానంద 1863 జనవరి 12న జన్మించార ని, రామకృష్ణ పరమహంస ప్రియ శిష్యుడని, వేదాంత, యోగ తత్త్వ శాస్త్రంలో సమాజంపై అత్యంత ప్రభావం కలిగించిన ఒక ప్రఖ్యాత ఆధ్యాత్మిక నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీదేవి, ఎన్ఎస్ఎస్ అధికారులు, పి.నీలవేణి కళాశాల సిబ్బంది, స్టెప్ సిబ్బంది పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** నగర పంచాయతీ పరిధిలోని వాకర్స్ అసోసియేషన్ ప్రాంగణంలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా జరుపు కున్నారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చికాగోలో జరిగిన సర్వమత మహాసభల్లో భారతీయ కీర్తి ప్రతిష్టల్ని విశ్వవ్యాప్తం తెలిపారని అన్నారు. కార్యక్రమంలో యన్.క్రిష్ణారెడ్డి, సాంబశివయ్య, ప్రసాద్, ప్రభాకర్, రాజశేఖర్, గోపాలకృష్ణ, రమేష్ పాల్గొన్నారు. **పీలేరు:** స్వామి వివేకానంద జయంతి వేడుకలు పీలేరులో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక కోటపల్లి క్రాస్ లోని వివేకానందుని విగ్రహానికి పీలేరు వాసవి క్లబ్ గ్రేటర్, వాసవి కపుల్స్ క్లబ్ సంయుక్తంగా పూల మాలలు వేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమానికి వి211ఎ జిల్లా గవర్నర్ సోమిశెట్టి సురేష్‌బాబు, రీజనల్ చైర్మన్ పామిడి జయచంద్ర, జిల్లా అధికారులు తులసీ కృష్ణ, సకలా హరి, కేసర్ల భరత్, సభ్యులు అమరా సత్యనా రాయణ, పీలేరు వాసవి క్లబ్ గ్రేటర్ ప్రెసిడెంట్ ఆమూరి శివఫణేష్, కార్యదర్శి కొత్తమాసి గోవర్ధన ప్రసాద్, కోశాధికారి రాచపల్లి అనిల్ కుమార్, వాసవి కపుల్స్ క్లబ్ కార్యదర్శి ఆమూరి శంకర్ నాథ్, కోశాధికారి బండారు ఉమా మహేష్, సభ్యులు పాల్గొన్నారు. **మదనపల్లి :** మదనపల్లి సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (డేటా సైన్స్) విభాగం ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోతవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా రామమూర్తి, మోటివేటర్, పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎడ్యుకేషన్ పై ఆసక్తితో చదవాలని అన్నారు. దేశ భవిష్యత్ యువత చేతిలోనే ఉందని, ప్రతి ఒక్కరు తాము అనుకున్న లక్ష్యాలను సాధించాలని ఆయన అన్నారు కార్యక్రమం లో కళాశాల విభాగాధిపతి డాక్టర్ కుసుమ,అధ్యాపకులు పాల్గొన్నారు..



మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తున్న రైతులు

గడ్డివామి దగ్ధం : రైతుకు తీవ్ర నష్టం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

గడ్డివామి దగ్ధమై రైతుకు తీవ్రనష్టం వాటిల్లిన సంఘటన నిమ్మ నపల్లి మండలంలో జరిగింది. రెడ్డివారిపల్లి పంచాయతీ అయ్యావారిపల్లికు చెందిన మొగిలేశ్వర్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి వ్యవసాయం చేసు కుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యావారి పల్లిలోని తన ఇంటి వద్ద పశువుల కోసమై వరిగడ్డిని వామినిగా వేసి ఉంచామని తెలిపారు. శుక్రవారం ప్రమాదవశాత్తు గడ్డివామికి నిప్పు అంటుకొని మంటలు చెలరేగినట్లు తెలిపారు. స్థానికులు మంటలను అదు పులోకి తేవడానికి తీవ్రంగా శ్రమించినా అప్పటికే గడ్డివాము కాలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు ఐదు ట్రాక్టర్ల లోడు కలిగిన గడ్డివామి కాలిపోయి, తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. సంఘటనపై స్థానిక సర్పంచ్ రెడ్డ మ్మ నరేంద్రరెడ్డికి సమా చారం అందించగా, ఘటన స్థలాన్ని సర్పంచ్ రెడ్డమ్మ భర్త వైసిపి నాయకులు నరేంద్రరెడ్డి పరిశీలించి, రెవెన్యూ అధికా రులకు సమాచారం అందించి తెదుకుంటామని తెలిపారు.

క్రికెట్ పోటీల్లో కొట్టాల జట్టు విజయం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని రేణుకలపల్లి ఉన్నత పాఠశాల మైదానంలో శుక్ర వారం జరిగిన ఆడుదాం ఆంధ్ర క్రికెట్ సెమీ ఫైనల్ పోటీలలో కొట్టాల జట్టు విజయం సాధించింది. కోటకొండ జట్టు రన్నర్స్‌గా నిలిచారు. ఈ పోటీలలో నాలుగు టీమ్‌లు పాల్గొన్నట్లు పీడీ మొగల్‌ఖాదర్‌బాషా తెలిపారు. కార్యక్ర మంలో సర్పంచ్ మహమ్మద్ అలీ, ఎంపిడిఒ సురేంద్రనాథ్, పంచా యతీ కార్యదర్శి సాకేమ్మ, పిఇటిలు చలపతిరెడ్డి, రాజీవ్ పాల్గొన్నారు.

'ఆదిత్య'లో ఇండస్ట్రియల్ ఎనర్జీపై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లి సమీపంలోని పుంగనూరు రోడ్డులో ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఇండస్ట్రియల్ ఎనర్జీ సిస్టమ్స్ గురించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో యంకోర్ టెక్ అకాడమీ ప్రయివేట్ లిమిటెడ్ హెచ్ఆర్‌ఎం పార్థసారధి ఇండస్ట్రియల్ ఎనర్జీ గురించి ప్రస్తుతం ఉద్యోగ అవకాశాలు ఎలా ఉన్నాయి, ఉద్యోగం ఎలా సంపాదించాలనే విషయంపై విద్యార్థులకు వివరించారు కార్యక్రమంల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్‌బాబు, ఇఇఇ హెచ్‌ఒడి డాక్టర్ ఎల్. వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ కె.వి. వరప్రసాద్, ఇసిఇ విద్యార్థులకు ఇండస్ట్రియల్ ఎనర్జీ గురించి వివరించారు.



అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు



దుప్పట్లు పంపిణీ చేస్తున్న శివరాజు, రవిరాజు

నిరాశ్రయులకు దుప్పట్లు వితరణ

ప్రజాశక్తి-రాయచోటి : సోమలరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండర్ శివరాజు, జిల్లా వ్యవసాయ శాఖ సలహా సభ్యులు రవిరాజు నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు, గర్భిణులకు, బాలింతలకు బస్టాండ్ ఆవరణంలోని నిరాశ్రయులకు, వీరభద్ర స్వామి ఆలయం పరిసర ప్రాంతాల్లో ఉన్న నిరు పేదలకు దుప్పట్లతోపాటు సబ్బులు, పేస్టులు, బ్రష్‌లు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండర్ శివరాజు కుమారుడు ఇషాక్‌రాజు, డేనియల్ కొప్పోలు, వీరబల్లి జాహ్నవి పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** లయన్స్ క్లబ్ అధ్యక్షులు పెనిగల పాటి చంద్ర సహకారంతో క్లబ్ ప్రతినిధులు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద బలిజపల్లి, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లోని పేదలు, యాచకులు, నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతిని ధులు మాట్లాడుతూ శీతాకాలంలో పెరిగిపోతున్న చలిని దృష్టిలో ఉంచుకొని నిరాశ్రయులైన వారికి దుప్పట్లు అందించామని తెలి పారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి నరసింహరాజు, లక్ష్మీనా రాయణ, జిల్లా చైర్మన్లు గీతాంజలి, రమణ, అబ్దుల్లా పాల్గొన్నారు.

ఉచిత రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-మదనపల్లి : ప్రియాంకగాంధీ పుట్టినరోజు సందర్భంగా మదనపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించి నట్లు మదనపల్లి నియోజకవర్గ నాయకులు రెడ్డి సాహెబ్ తెలిపారు. ప్రియాంకగాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించ్చామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బాషా, మీనాకుమారి, చలపతి, మండల అధ్యక్షులు వైఎస్.రెడ్డి, మహబూబ్ పీర్, మహమ్మద్ అలీ, అన్వర్, మహమద్ రఫీ, సమీర్, ఖాసీం, సయ్యద్, సోను, శరత్‌కుమార్‌రెడ్డి, రవి, గుల్షన్, బయ్యారెడ్డి,పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్‌ను కలిసిన మహేష్

ప్రజాశక్తి-మదనపల్లి : జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌ను జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్స్ మహేష్.శుక్రవారం మంగళగిరిలోని కేంద్ర కార్యాలయంలో కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పవన్ అన్నమయ్య జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో టిడిపి జనసేన అభ్యర్థులు విజయం కోసం కృషి చేయాలని రెండు పార్టీల నాయకుల మధ్య సమన్వ యానికి కృషి చేయాలని ఆదేశించారని చెప్పారు. పుంగనూరు, పీలేరు నియో జకవర్గం నుంచి వివిధ పార్టీల నాయకులు జనసేనలో చేరారని తెలిపారు.



పవన్ కల్యాణ్‌తో మహేష్



తంబళ్లపల్లి: రోగులకు మందులు అందిస్తున్న ఎంపిడిఒ శేషగిరిరావు

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్య సేవలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

జగనన్న ఆరోగ్య సురక్షతో కార్యక్రమంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని వైద్యాధికారి డాక్టర్ రమేష్‌బాబు, ఎంపిడిఒ శేషరిరావు అన్నారు. శుక్రవారం మండలంలోని అగ్రహారం సచివాలయం వద్ద రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ ఉషారాణి, ఎంపిటిసి కుసుమ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్య మంత్రిగా జగన్మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ప్రజలకు వైద్యాన్ని మరింత చేరువ చేయడానికి వైద్య ఆరోగ్య రంగంలో ప్రతి గ్రామంలోనూ, వైద్య ఆరోగ్య సిబ్బంది, వాలంటీర్లు ప్రజల ఆరోగ్యాన్ని సర్వే చేసి, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి, వారికి వైద్య బృందమే నేరుగా ఇంటికి వెళ్లి వైద్య సేవలను అందించి, మందులను పంపిణీ చేసేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మహిళలకు, వృద్ధులకు, కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి, బిపి, షుగర్ వంటి సమస్యలు కలిగిన వారికి 104 రకాల పరీక్షలు చేసి వైద్య సేవలు అందిస్తున్నట్లు వివరించారు. 305 మంది జగనన్న ఆరోగ్య సురక్షలో వైద్య సేవలు పొందగా, అందులో 50 మందికి ల్యాబ్ పరీక్షలను నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి కుటుంబానికి వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కార్డును మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఉషారాణి, మహదేవరెడ్డి, ఎంపిటిసి కుసుమ, వైసిపి నాయకులు దయాకర్‌రెడ్డి, డాక్టర్ రామాంజనేయులు, డాక్టర్ మహతి, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణరెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.**తంబళ్లపల్లి:** జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు ఒక వరం లాంటిదని డాక్టర్లు మునికుమార్, తేజస్విలు తెలిపారు. గుండ్లపల్లె గ్రామ సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్ర మాన్ని ఎంపిడిఒ సురేంద్రనాథ్ ప్రారంభించారు. డాక్టర్లు మునికుమార్, తేజశ్రీ ఆప్తమాలజిస్ట్ రెడ్డప్ప రెడ్డిలు సుమారు 250 మందికి రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారా యణరెడ్డి ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యశ్రీ కార్డును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ అందిస్తున్న వైద్యసేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఉదయ్‌కుమార్‌రెడ్డి (బాబు రెడ్డి), మౌలాలి, లలిత, నాయకులు చంద్ర శేఖర్ రెడ్డి,ప్రవీణ్ నాయక్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్



మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొరముట్ల

రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలు మృతి

- మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలు మృతి చెందిన సంఘటన రైల్వేకో డూరు మండలం రాఘవరాజుపురం సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని బాలిరెడ్డిపల్లి వైఎస్ఆర్‌నగర్ గ్రామానికి చెందిన ఉదయగిరి భార్గవ్ అతని భార్య లక్ష్మీదేవిలు ఆటోలో వారి గ్రామానికి వెళు తుండగా రాఘవరాజుపురం వద్ద లారీని ఢీకొనడంతో ప్రమాద స్థలంలోనే ఇద్దరూ మృతి చెందారని తెలిపారు. వెంటనే ప్రమాద స్థలానికి చేరుకున్న కోడూరు సిఐ మధుసూదన్ రెడ్డి, ఎస్ఐ డాక్టర్ నాయక్ మృతదేహాలను తరలించి కేసు నమోదు చేసి వాహనాల రాకపోకలను పునరుద్ధరించినట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే రోడ్డు ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని ప్రభుత్వ విప్ కోరముట్ల శ్రీనివాసులు పరిశీ లించి మృతి చెందిన భార్గవ్, లక్ష్మీదేవి దంపతుల మృతదేహాలను పరిశీలిం చారు. బోరున విలపిస్తున్న మృతుల బంధువులను ఓదార్చారు. ప్రమాదం జరిగిన తీరు గురించి సిఐ మధుసూదన్ రెడ్డి కోరముట్లకు వివరించారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ పి.రామకృష్ణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు... శుక్రవారం ముష్టూరు పంచాయతీ దిగువపల్లి వద్ద కొంతమంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందిందన్నారు. తన సిబ్బందితో స్థావరంపై దాడులు నిర్వహించి ఐదుగురిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2,080లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ శివరామకృష్ణ, కానిస్టేబుల్ రాజేష్ పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

ప్రజాశక్తి-కలకడ

అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. శుక్రవారం అరెస్టయిన దొంగల ముఠాను విలేకర్ల ఎదుట ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎస్‌పి ఆదేశాల మేరకు, రాయచోటి డిఎస్‌పి సయ్యద్ మహబూబ్‌బాషా, సిఐ నాగేంద్ర సూచనల మేరకు శుక్రవారం అంతర్రాష్ట్ర దొంగల ముఠాపై నిఘా ఉంచామని తెలిపారు. అన్న మయ్య, తిరుపతి జిల్లాలలో బంగారు దుకాణాలలో దొంగతనాలకు పాల్పడిన కర్ణాటక రాష్ట్రం, బెంగళూరు సిటీ కోలార్ తాలూకా అరబి కొత్తనూరుకు చెందిన రామప్ప వెంకటేశు, దోర్డసల్లా పంచాయితీ గాజులదిన్నెకు చెందిన మునియప్ప చంద్రశేఖర్, అరబ్బీ కొత్తనూరు గ్రామానికి చెందిన ముద్దప్ప నారాయణస్వామిలు కలిసి బంగారు దుకాణములలో 71 గ్రాముల బంగారు గొలుసులు, ఉంగరాలు దొంగలించినట్లు తెలిపారు. వీటి విలువ రూ.4.26లక్షలు ఉంటుందని అంచనా వేసినట్టు తెలిపారు. ఈ ముగ్గురూ నిందితులు స్నేహంగా ఉంటూ దొంగతనాలకు, చెడు అలవాట్లకు బానిసై గత ఏడాది ఆగస్టు 10న కలకడ పట్టణం లోని ఎస్ జెబి బంగారు దుకాణంలో బంగారు గొలుసును దొంగిలించినట్లు ఫిర్యాదు రావడంతో తన సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టి నట్టు తెలిపారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పోలీస్ స్టేషన్, పిటిఎం పోలీస్ స్టేషన్, రాయచోటి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం నాలుగు కేసులలో నాలుగు బంగారు గొలుసులు, ఒక ఉంగరం దొంగలించారని తెలిపారు. ఈ దొంగతనాలకు పాల్పడిన ముగ్గురిని శుక్రవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.దొంగల ముఠాను పట్టుకోవడంలో పోలీసు సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ హరి, తాతయ్య, ముత్యాలు, కరుణాకర, హోంగార్డ్ డ్రైవర్ రమేష్‌లు చాకచక్యంగా వ్యవహరించారని తెలిపారు.



అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు చూపుతున్న పోలీసులు